


# బకాసురుడి రేషన్ కార్డు

మేనంపాటి భాస్కర్

బకాసురుడికి మళ్ళీ జన్మ ఎత్తాల్సిన టర్న్ వచ్చింది. పరలోకంలోని జనన మరణాల ఆఫీసు వాళ్ళు అతన్ని కేకేసి, "ఇదిగో! కొన్నాళ్ళపాటు మళ్ళీ నువ్వు పుట్టాలోయ్! దేవతగా పుడతావా? లేకపోతే మళ్ళీ రాక్షస జన్మే కావాలా? అదీ కాకపోతే మానవజన్మా? జంతుజన్మా?" అన్నారు ఛాయిస్ ఇస్తూ.

"దేవతలు ఆడంగోళ్ళు! నే నెట్టాగూ రాచ్చసుణ్ణే! అందుకని మడిసిగానే పుడతాను" అన్నాడు బకాసురుడు.

"సరే! ఎప్పుడు పుడతావ్?"

బకాసురుడు సంశయించాడు.

అతను ఎటూ తేల్చుకోలేకపోవటం గమనించి, 'భవిష్యద్దర్శిని' అనే అద్దం దగ్గరికి తీసుకెళ్ళాడు ఓ గుమాస్తా. అందులో భూత భవిష్యద్వర్తమాన దృశ్యాలు కనబడుతాయి.

"చూడు" అంటూ దాన్ని ఆన్‌చేశారు, దృశ్యాలు మారుతున్నాయి. శతాబ్దాలు గిరగిర తిరుగుతున్నాయి.

ఇరవయ్యో శతాబ్దం ముప్పాతిక భాగం గడిచాక, దృశ్యాలు గుర్తుపట లేనంతగా మారి పోయాయి. వంద అంతస్తుల మేడలు, బోయింగ్ విమానాలు, దేవతా వస్త్రాల్ని ఏడం కాలితోతన్నే టెర్లిన్లూ, సింథెటిక్‌లూ వాటిని చాలీ చాలనట్లు కట్టుకునే అమ్మాయిలూ...

"అప్పుస్వామీ! ఇక్కడ పుడతాను!" అన్నాడు బకాసురుడు. గుమాస్తా భవిష్యద్దర్శిని ఆపేశాడు. అది 1990 దగ్గర ఆగింది

ఇరవయ్యో శతాబ్దపుమేడలూ, మిద్దెలూ, విమానాలూ, విహారాలూ చూసి బకాసురుడు మోజుపడ్డాడేగానీ, తనకి అత్యంత ముఖ్యమైనది, అంటే తిండి, బొత్తిగా షార్టేజిలో ఉందని గ్రహించలేదు. (బకాసురుడు బండెడు అన్నాన్ని, బండికి కట్టిన దున్నల్తో సహా తినేశాల్తి అని చదువరులు గుర్తుంచుకోవాలి)

"నేను పుట్టాను... ... ఈలోకం పెట్టింది!" అని పాడుకుంటూ, టైఫాయిడ్ మంచి కోలుకున్న పేషెంటులా, కరకరలాడుతున్న ఆకలితో పుట్టాడు బకాసురుడు.

ఎలా పుట్టాడు?

అయోని సంభవుడిలాగా, తల్లిదండ్రుల ప్రసక్తిలేకుండా, ముప్ఫయ్యేళ్ళ వయసులో, దేముడు వెలిసినట్లు ఒక ఇంట్లో వెలిశాడు. ఆ ఇల్లుకూడా రాత్రికి రాత్రే వెలిసింది. నిన్నటివాకా 'చిన్న' మనుషులుగానే ఉన్నవాళ్ళు రాత్రికిరాత్రి 'పెద్ద' మనుషులయి పోవడం, రెండ్రోజులు తిరిగేసరికి బిల్డింగులు లేపేసుకోవడం జనం చూస్తూనే ఉన్నారు కాబట్టి, బకాసురుణ్ణిచూసి, 'అసలు నిన్నటిదాకా లేనివ్యక్తి ఒక్కరోజులో ఇంత పెద్దవాడెలా అయ్యాడు?" అన్న మీమాంసలో పడలేదు.

బకాసురుడు బద్ధకంగా కళ్ళుతెరచి ఆవలించి, చూసేసరికి చేతిలో రేషన్ కార్డుంది. దానిమీద 'కె. బకాసుర్రావ్' అని రాసిఉంది. జేబులోకాసిని డబ్బులున్నాయ్. అతనికి ఆకలేసింది. వంటింట్లోకెళ్ళి చూశాడు. డబ్బాలన్నీ ఖాళీగా ఉన్నాయ్. ఆ కార్డునే తినాలేమో అనుకుని కొరికి చూశాడు.

సహించలేదు.

విలుకలు వంటింటో మానేసి అతని కడుపులో పరిగెత్తడం మొదలెట్టాయి— కాసేపు అటూ ఇటూ తారట్లాడి, తర్వాత బజార్లో పడ్డాడు ఒక పెద్దమనిషికి ఆ కార్డు చూపించి, "ఇదేమిటి?" అన్నాడు.

"అది రేషన్‌కార్డు ఏం ? నీకొద్దా ?" అన్నాడాయన ఆశగా.

బకాసురుడు కార్డు నిగట్టిగా పట్టుకున్నాడు.

"దీనితో ఏంచేయాలి?" అన్నాడు తెలివిగా.

"రేషను షాపుకెళ్ళి అది చూపిస్తే, చక్కెర, బియ్యం, గోధుమలూ ఇస్తారు ! తెచ్చుకో పో !"

"ఇంటికెళ్ళి సంచులు తీసుకెళతాను" అంటూ బకాసురుడు వెనక్కి తిరగ బోయాడు

"భలేవాడివే ! సంచుల్నిండా వస్తాయనుకుంటున్నావేమిటి సామాన్లు ! జేబులో పోయించుకో ! వెళ్ళు !" అన్నాడాయన.

బకాసురుడు ఆయన మాటలు నమ్మకుండా ఇంటికెళ్ళి, సంచులు తీసుకుని, రేషను షాపుముందర క్యూలో నిలబడ్డాడు.

రెండు గంటలు గడిచాయి. నత్తలా మెల్లగా నడుస్తోంది క్యూ. కొంతమంది బార్బర్లు "క్షౌరం ? క్షౌరం ?" అంటూ క్యూ పొడుగూతా విచారణ చేస్తున్నారు. నెలరోజుల్నుంచీ క్యూలో నిలబడి, బిరివి గెడ్డాలు పెరిగి బార్బేరియన్‌లాగా ఉన్న వాళ్ళు, ఆ బార్బర్లని పిలిచి, కాస్త ఆసింటా జరిగి, క్షౌరకల్యాణం చేయించుకుంటున్నారు.

ఇంతలో క్యూలో బకాసురుడి ముందునిలబడ్డ గడ్డముక్కు పెద్దమనిషి ఇటుకేసి తిరిగి, "సార్ ! రేపే తెల్లార్తే పండుగ ! పండక్కి అల్లుడొచ్చాడు. కాస్త గెంటడో జలపాటు అతన్ని దువ్వి, ఓ జతబట్టలు పెట్టి, రైలెక్కించి వస్తాను కాస్త నాప్లేస్ చూస్తూ ఉండండి" అన్నాడు.

"సరే !" అని తలూపాడు బకాసురుడు. గ. ము. పె. మ. పరిగెత్తి ఇంటి దారి పట్టాడు.

ఇంతలో బకాసురుడికి అరఫర్లాంగు దూరంలో నల్లచొక్కా వేసుకుని క్యూలో నిలబడ్డ పెద్దమనిషి దగ్గరికి ఎవరో పరిగెత్తుకొచ్చి "సార్రార్ ! మీ కొడుకు పుట్టాడు !" అన్నాడు రొప్పుతూ

వెంటనే ఆ పెద్దమనిషి మొహం వివర్ణమయింది. "అసంభవం ! గత పదకొండు నెలలుగా నేనీ క్యూలోనే నిలబడి ఉన్నానే!" అన్నాడు. ఆయన మొహంలో అనుమానపు ఛాయలు కనబడ్డాయి.

ఆ వార్తాహరుడు తటాపటాయించి, "తమరు ఆనందరావుగారు కాదా? నల్లచొక్కా వేసుకుని క్యూలోనిలబడి ఉంటారు వెళ్ళి కబురు చెప్పిరా ! అని తరిమారండీ" అన్నాడు బిక్కమొహం పెట్టి.

"ఎవడిదోయ్ నల్లచొక్కా ? ఇది మల్లెపువ్వులాంటి తెల్లచొక్కా ! పదకొండు నెల్లపాటు ఏకధాటిన వేసేసరికి నల్లబడింది ! అంతే !" అన్నాడు న. చొ. పె. మ

ఇంతలో సంచిలో చక్కెర పోయించుకుని విజయగర్వంతో తిరిగివస్తున్న ఇంకోమానవుడు ఈ కలకలంవిని "నేనే ఆనందరావుని. ఏమిటి విశేషం ?" అన్నాడు ఆయనా నల్లచొక్కానే వేసుకుని ఉన్నాడు.

"మీకు కొడుకు పుట్టాడండోయ్ !" అన్నాడు వార్తాహరుడు ఉత్సాహం పుంజుకుని.

కాని అరెండో నల్లచొక్కా ఆయనకి మాత్రం "పుత్రోత్సాహము తండ్రికి... ..." అన్న పద్యం గుర్తురాలేదు. "రేపే రేషన్ ఆఫీసుకెళ్ళి ఇంకో యూనిట్ పెరిగినట్టు కార్డులో రాయించుకోవాలి" అనుకున్నాడు దిగులుగా.

క్యూలో ఉన్న జనమంతా ఆయనకి "హార్టీ కంగ్రాచ్యులేషన్స్ !" చెప్పి, తమ సంవత్సర 'క్యూ' అనుబంధాన్ని పురస్కరించుకుని స్వీటు ఇప్పించాలని కోరారు ముక్త కంఠంతో.

"జేబులో డబ్బుల్లేవు" అన్నాడాయన.

"పంచదారకంటే తీపి అయిన పంచదార ఉందిగా ! అదే పంచండి!" అన్నారందరు.

విధిలేక సంచిలోంచి గుప్పెళ్ళతో పంచదార తీసి క్యూలో ఉన్నవాళ్ళకి పంచటం మొదలెట్టాడు.

"మహాప్రసాదం !" అంటూ ఒకాయన దోసిలిపట్టి పంచదార అందుకుని, అది నోట్లో పోసుకోకుండా సంచిలో పోసుకున్నాడు. అందరూ అదేపద్ధతి అవలంబించి, చక్కెర గుప్పెళ్ళతో అందుకుని, సంచుల్లో పోసుకున్నారు. మొదటి పదిమందికి పంచేసరికి పంచదార అయిపోయింది. ఆయన మళ్ళీ షేక్‌స్పియర్ మొహం పెట్టుకుని క్యూలో


రావి శ్రీమన్నారాయణ M.A., నవల "యువరాజు" రు. 18/- మాత్రమే!

"యువరాజు"

ముందుగా రు 10/- M.O. చేస్తే రు 8/- లకు V.P గా పంపిస్తాము. రు. 5,000/- నగదు బహుమతు లున్న "యువరాజు" వ్యాస రచన పోటీకి వ్యాసాలు మాకు చేరవలసిన తేదీ : 31-7-81.

VARALAKSHMI PUBLICATIONS (Phone 445232) 11-2nd St., Dr.B.N. Reddy Road, T. Nagar, MADRAS-600 017.

వచ్చి నిలబడ్డాడు. ఈ లోగా అల్లుణ్ణి చూడ్డానికెళ్ళిన గద్దముక్కు పెద్దమనిషి హుషారుగా క్యూలో పునఃప్రవేశం చేశాడు.

"అల్లుడెళ్ళాడా?" అన్నాడు బకాసురుడు పలకరింపుగా.

"ఆఁ! నా మొహం! అలిగికూర్చున్నాడు!"

"ఎందుకూ అలక? స్కూటర్ కోసమా?" అన్నారెవరో.

"బట్టలా?" అన్నారింకెవరో.

"స్కూటరూ, బట్టలయితే ఎక్కడో అక్కడ అప్పోసొప్పో చేసికొని పెట్టకపోయాను. అదికాదుట! మా చక్కెరకోటా ఈ నెలది, పండక్కి ఇచ్చే ఎక్స్‌ట్రాతో సహా తనకివ్వెయ్యమంటాడు. దీనికి మా అమ్మాయి రికమండేషనూ!"

క్యూ జరిగింది. గ. ము. పె. మ. సంచీలో చక్కెర పోయించుకోగానే ఒక శాల్తీ గద్దలా వాలి, ఆ సంచీ అందుకుని, "వస్తా మామగారూ!" అంటూ రిక్షాలోకిగెంతి స్టేషన్ వైపు సాగిపోయింది.

బకాసురుడు ఇదంతా మిడిగుడ్లు వేసుకుని చూస్తున్నాడు. అలవాటు లేని అవస్థ కావటం వల్ల అతనికి క్యూలో నుంచోటం ప్రాణాంతకంగా ఉంది. అప్పుడే నాల్రోజులు గడిచిపోయాయ్.

స్వర్గ ద్వారాల్లా కనబడుతున్న ఆ షాపు తలుపులు హఠాత్తుగా మూసుకుపోయాయి. "స్టాకయి పోయింది 'ట'!" "స్టాకయిపోయింది 'ట'!" అని హాహాకారాలు వినపడ్డాయి. క్యూ మాత్రం చెదరి పోలేదు. రబ్బరు పాములా అలాగే కదలకుండా ఉంది, మళ్ళీ రావాల్సిన స్టాకుకోసం ఎదురుచూస్తూ.

బకాసురుడికి శోష వచ్చింది—

"లావు ఒక్కింతయు లేదు... ప్రాణాలు తావులు దప్పుతున్నాయి..." అని గోల పెట్టడం మొదలెట్టాడు బక్క చిక్కిన బకాసురుడు.

* * *

అలవైకుంఠ పురంబులో, ఆమూల సౌధంలో పడుకుని, లక్ష్మీదేవి పమిటకొంగు నలుపుతూ పరధ్యాన్నంగా ఉన్న విష్ణుమూర్తి చటుక్కున లేచి, చెవులు రిక్కించి విని, పరిగెత్తబోయి, హఠాత్తుగా కాలు బెణికిన వాడిలా ఆగి, మళ్ళీ వచ్చి లక్ష్మీదేవి కొంగు పట్టుకున్నాడు.

"ఏం గిరాకి? మళ్ళీ ఇంకో గజేంద్రుడు



మొసలినోట్లో చిక్కుకున్నాడా?" అంది లక్ష్మీదేవి.

"కాదు. వీడెవడో రేషను షాపు క్యూలో చిక్కుకుని రక్షించమని రంకెలేస్తున్నాడు."

"పోనీ రక్షించగూడదూ పాపం!" అంది లక్ష్మీదేవి విలాసంగా.

విష్ణుమూర్తి చిన్నబుచ్చుకున్నాడు.

"మీరిమధ్య బొత్తిగా ఇల్లు కదలడం మానేశార్లెండి! పొద్దస్తమానం నా కొంగు పట్టుకుని కాలక్షేపం!" అని మెత్తగా ఒకటి అంటించి, డబ్బులు పోలిథిన్ బాగ్సులో మూటలు కట్టడం పూర్తి చేసింది.

"డబ్బు బట్వాడానా?" అన్నాడు విష్ణుమూర్తి ఎకసెక్కెంగా. 'ఎవరెవరున్నారివ్వాళ్ళి లిస్టులో?"

లక్ష్మీదేవి నవ్వుతూ లిస్టు చూపించింది. అందులో మొదటిపేరు చూడగానే విష్ణుమూర్తి ఉలిక్కిపడ్డాడు.

"రేషనుషాపు ఓనరు రాజారావా! వాడి షాపుముందే నాభక్తులు అల్లల్లాడు తున్నారు. వాడికి డబ్బులివ్వకు!" అన్నాడు కంగారుగా.

"ఏం? ఎందుకని? అతనికి లక్ష్మి కటాక్షముంది. చేతనైతే మీ భక్తుని మీరూ రక్షించుకోండి." అంది ఓరగా చూస్తూ.

"నీవేతప్ప ఇతఃపరంబెరుగ— ..." అని బకాసురుడి గొంతు వినబడుతోంది. విష్ణుమూర్తి శ్రద్ధగా విన్నాడు. ఆయన మొహంలోకి కళవచ్చింది. "అదెక్కడో విన్న గొంతే... ... ఆఁ! బకాసురుడు!" అంటూ లక్ష్మివైపు విజయగర్వంతో చూసాడు. "లక్ష్మీ! ఓడిపోయావ్! యుగధర్మాన్ననుసరించి రాక్షసులూ, భూతాలూ, పిశాచాలూ నీ భక్తులు ఉండాలి. కానీ, రాక్షసుడయిన బకాసురుడు నీ పార్టీలోంచి నా పార్టీలోకి దూకేశాడు!"

లక్ష్మీదేవి పెద్దగా లక్ష్యపెట్టలేదు. "మీసంగతి వాడికి బాగా తెలిసిరావాలని నేనే వాణ్ణి మీక్యూలో పడేశాను. ఏమాత్రం. ఉద్ధరిస్తారో ఉద్ధరించండి చూద్దాం! మీశక్తిసామర్థ్యాలు ఏపాటివో అర్థమయ్యాక వాడికి జ్ఞానోదయం కలిగించి వాణ్ణి కటాక్షిస్తాను." అంది. "నువ్వెప్పుడూ నాకెగస్పార్టీనే!" అన్నాడు విష్ణుమూర్తి ముఖం గంటుపెట్టుకుని.

* * *

నానాకడగండ్లుపడి బకాసురుడు క్యూ తల దగ్గరికి చేరాడు. ఒక కిలో చక్కెరా, ఐదు కిలోల గోధుమలూ, పదికిలోల బియ్యం అతని సంచుల్లో పోశారు. అవి శాంపిలేమో అనుకుని నోట్లోవేసుకు చప్పరించేసి "అధ్వాన్నంగా ఉన్నాయి! మంచిరకం లేవా?" అని అడిగాడు.

"జరుగు! జరుగు!" అన్నాడు షాపు ఓనరు.

"పోనీ అవే పొయ్యండి."

"పోశాంగద, ఇంకేటి పోసేది?"

"అవి శాంపిలు కాదూ?" అన్నాడు బకాసురుడు తెల్లబోతూ.

బకాసురుణ్ణి నెట్టేశారు. అతని వాలకం చూసి ఒకాయన జాలిపడ్డాడు.

"ఇలా రేషన్ షాపుల్లోనే కాకుండా బయట కూడా అమ్ముతారు, బియ్యం, గోధుమలూ! కొనుక్కోండి! బొత్తిగా ఏం తెలీనట్టుంది పాపం!"

పక్కనే ఉన్న ఒక షాపులోకి వెళ్ళాడు బకాసురుడు. షాపులో అరలన్నీ ఖాళీగా వున్నాయి. అయినా వ్యాపారం ఉధృతంగా సాగుతోంది. రాక్షస మాయలాగా ఖాళీ అర

## కవి

నేను కవిని
మధువు పుచ్చుకొని
మగువ నుంచుకొని
పిండివంటలతో భోంచేసి
పచ్చకర్పూరపు కిళీ వేసి
ఏడంతస్తుల మేడలో
ఏసి రూములో
కుషను కుర్చీలో
కూర్చొని
కాలే కడుపులగురించి
పేదవారి బతుకులగురించి
ఆకలి కవిత్వం వ్రాస్తాను
మీరు చూస్తారు కవిత్వం
నాకు చేస్తారు సన్మానం
అందుకే
నేను పోతున్నాను పైపైకి
మీరు దిగజారిపోతున్నారు లోలోనికి

— "శ్రీ వాణి"

ట్లోంచే సామాన్లు తెప్పిస్తున్నాడు దుకాణా సురుడు.

"ఏం కావాలి?" అన్నాడు బకాసురుణ్ణి చూసి జవాబు వినకుండానే "లేవు!"

## బకాసురుడి రేషన్ కార్డు

అన్నాడు.

"చక్కెరా, బియ్యం, గోధుమలూ"

"లేవు! ఎంత కావాలి?"

"నాకు సరిపడా!"

"లేవు! ఎక్కడుంటారు మీరు?"

'లేవు' అనేది దుకాణాసురుడి ఊతపదమని


# అతి సుందరమైన వదనం నవ వధువు లాంటి రూపం



# క్లియరసిల్ మొటిమలను తెరుస్తుంది నివారిస్తుంది మరియు విస్తరించ నీయకుండా తోడ్పడుతుంది.



మీకు మొటిమలు వచ్చినపుడు, అనేక రకమైన సలహాలు మీకు ఇస్తుంటారు.

కాని ప్రపంచమంతటా క్లియరసిల్ సహాయం పొందిన లక్షలాది తరుణ వయస్కులు ఇచ్చే సలహా ఫలవంతమైనది క్లియరసిల్.... క్లియరసిల్ మీ మొటిమల సమస్యకు ప్రత్యేకంగా తయారుచేయబడి సురక్షితంగా, సులభంగా ఔషధియుక్తమైనది.

ఇప్పుడు మీపైనే అధికంగా ఆధారపడి వున్నది క్లియరసిల్‌ని వాడి మీ మొటిమలని నివారించుట మరియు అదుపు చేసుకొనుట ఇదిగో ఈ విధంగా :

- ప్రతిరోజూ రెండుసార్లు క్లియరసిల్ వాడండి. ఉదయం మరియు సాయంత్రం.
- మీ ముఖమంతా క్లియరసిల్ రాయండి. మొటిమలపైన కొంచెం అదనంగా రాయండి.
- మొటిమలు పోయిన తరువాత గూడా వాడుతుండండి. ఎందు కంటే క్లియరసిల్ మొటిమలను అదుపు చేయునిమిత్తం అదనపు నూనెను పీల్చుకొని మొటిమలని అదుపుచేస్తుంది.

అద్భుతమైన త్రివిధ చర్య —
ఒక్క క్లియరసిల్ మాత్రమే త్రివిధ చర్యగలది.



1. మొటిమలను తెరుస్తుంది. —ప్రత్యేకమైన ఔషధి యుక్త చర్య మొటిమల పై చర్మాన్ని తెరుటలో సహాయపడుతుంది.

2. మొటిమలను మటుమాయంచేస్తుంది. —హానికరంగా ఒత్తకుండానే రసిని వెలికివచ్చునట్లు చేస్తుంది.

3. మొటిమలను ఆరబెడుతుంది. —అదనపు నూనెను పీల్చి మొటిమలను మటుమాయం చేయుటకు తోడ్పడుతుంది.




మీ ముఖం అందంగా తేటగా ఉంటే, మరి మీకు ప్రతిదినం ప్రతి నిముషం ఉల్లాసకరం!

ప్రపంచంలోని నం. 1 పింపుల్ క్రీమ్

OBM/2115 TLR

గిపో చాడు బకాసురుడు.

"ఈ పక్క సందులో! కొత్తిల్లు!" అన్నాడు.

"లేవు! పాపం కొత్తవాళ్ళు కదా ని ఇస్తున్నా! డబ్బులియ్యండి!"

"ఎంత?" అన్నాడు బకాసురుడు అజ్ఞానం కొద్దీ.

దుకాణాసురుడి మొహం సీరియస్‌గా అయిపోయింది. 'లేవు! పో!" అన్నాడు.

పక్కనున్న వాళ్ళు బకాసురుణ్ణి మందలించారు. "పెద మనిషిని, రేటెంతా, గీటెంతా అని నిలదీస్తావా? చేతిలో ఉన్న సంచీ, జేబులో ఉన్న డబ్బూ, వారి చేతిలో పెట్టి లెంపలేసుకో!" అన్నారు

బకాసురుడు మారుమాటాడకుండా జేబులో ఉన్న మూడొందలూ, చేతిలో ఉన్న మూడు సంచులూ దుకాణాసురిడి చేతిలో పెట్టాడు. అతను మూడొందలుగల్లాపెట్టెలో వేసుకుని మూడుపావలాలు తిరిగిచ్చాడు. సంచుల్లో శాస్త్రార్థం కొది కొద్దిగా చక్కెరా, గోధుములూ పోశాడు. అక్షింతల్లాగా కాసిని బియ్యపుగింజలు కూడా చల్లాడు.

దార్లోనే ఫుట్‌పాత్‌మీద నిలబడి అవి ఊదేశాడు బకాసురుడు. అతని కడుపు నిండలేదు.

రోజులు భారంగా గడుస్తున్నాయి. పాత కాలపు వితంతువులా అతను పేలాలు, మరమరాలూ, ఉప్పుడుపిండీ ఒంటిపూట ఫలహారంచేసి బతుకుతున్నాడు. అతనికడుపు నిండట్లేదు ... మండుతోంది.

ఒకానొక రోజున అతను బజార్లో వెళుతుంటే ఒకబోర్డు అతని చూపులకి కళ్ళెం వేసింది.

'ఆనందవిలాస్ – కాఫీ మరియూ భోజన హోటలు'

ఎగిరి గంతెయ్యాలనిపించింది! ఆబోర్డునే అప్పడంలా తినెయ్యాలనిపించింది.

రేషన్‌షాపుల్తో, కిరాణా షాపుల్తో అవసరంలేకుండానే కడుపు నిండే ఈ అయిడియా ఇన్నాళ్ళనుంచీ తనకెందుకు తట్టలేదూ?

వెళ్ళి హోటల్లో కూర్చున్నాడు. టేబులంత విస్తరేసి, అమ్మవారి కుంభంలా అన్నం వడ్డిస్తారని ఎదురుచూస్తున్నాడు.

అతని ముందు చిన్న కంచం పెట్టి, దాన్లో పిడికెడు మెతుకులు పెట్టి, ఉద్ధరిణలాంటి గరిటతో ఒక్కసిపరుకూరా, కొద్దిగాకూటూ, కొద్దిగా సాంబారూ, చారూ వడ్డించారు.

తిని చూశాడు బకాసురుడు. అన్ని పదార్థాలూ ఒకే రుచితో ఉన్నాయి. కూరలో కొద్దిగా నీళ్ళు కలిపి పలచన చేసే అది కూటయినట్టూ, దాన్లో ఇంకాసిని నీళ్ళు కలిపి సాంబారూ, దాన్లో మరిన్ని నీళ్ళు కలిపి రసమూ తయారు చేసినటనిపించింది.

"ఏమిటీ కూడు?" అన్నాడు కడుపు మండి.

"సొరకాయ కూటు– మళ్ళీ వెయ్యరు" అన్నాడు సర్వరు

"కూటు కాదు. 'ఏమిటీ కూడు?' అంటున్నాను" అన్నాడు బకాసురుడు. సర్వారావు అప్పటికే మూడు టేబుళ్ళు దాటిపోయాడు. బకాసురుడు తినడం మొదలెట్టక ముందే అయిపోయింది అన్నం.

అలా ఒక నెల గడిచింది.

భూలోకంలో నెల గడిపేసరికి అతనికి ఒకప్పుడు తను నరకంలో గడిపిన రోజులు 'బంగారు రోజులా' అనిపించ సాగాయి. నరకంలో ఎవగే పాపం చేశారో తెలిసిఉండేది. ఏపాపాని కెంత శిక్షో అందరికి తెలిసి ఉండేది. ఆ శిక్ష పూర్తి కాగానే వదిలేసేవారు. ఇక్కడలా కాదు!

మరుసటి నెల మొదటి తారీఖున బకాసురుడు భోజనాని కూర్చున్నాడు. ప్లేటు తెచ్చిపెట్టాడు సర్వరు.

"ఇడ్లీ తెచ్చావేమిటి? మీల్సు తీసుకురా" అన్నాడు బకాసురుడు.

"అది భోజనమే! సరిగ్గా చూడు!" అన్నాడు అప్పుడే అటు వచ్చిన ప్రొప్రైటరు.

బకాసురుడు మొన్న ఎగ్జిబిషన్లో కొనుక్కున్న భూతదం జేబులోంచితీసి చూసాడు.

అది అన్నమే! సరిగ్గా రెండిడ్లీ లసైజులో రెండు ముద్దలు! కూటు వుంది కూరలేదు! సాంబారు ఉంది, అప్పడం లేదు! మజ్జిగుంది పెరుగులేదు! నిన్నటికీ, ఇవాళ్టికీ చిక్కిసగమై పోయింది భోజనం!

"ఇంత తగ్గించారేం?" అన్నాడు బకాసురుడు పెద్దగొంతుతో.

"ధరలు తగ్గించాం!" అన్నాడు యజమాని.

"ధరలు తగ్గించడం మాట అలాఉంచు, భోజనమెందుకు తగ్గించారు?"


"... ... ..."

"నువ్వు ధరతగ్గించింది యాభై పైసలు! భోజనం రూపాయిది తగ్గించావ్ ధరలు తగ్గించడంవల్ల నీకేలాభం! మాక్కాదు."

"... ... ..."

"చెప్పవేం?"

యజమాని జవాబు చెప్పకుండా బకాసురుడి మొహంలోకే చూస్తున్నాడు అతని మొహంలో ఆశ్చర్యం కనబడుతోంది. హఠాత్తుగా బకాసురుడికి కూడా అవ్యక్త



సినిమాతారలు
శ్రీదేవి, సుజాత, జయసుధ, జయప్రద ల ఫోటోల సెట్టు 5 రూ. ఏయన్నార్, ఎన్టీఆర్, శోభన్‌బాబు, కృష్ణ, కృష్ణంరాజు ల ఫోటోల సెటు 6 రూ. నాటిగాయకుడు ఘంటసాల, నేటిగాయకుడు S. P. బాల సుబ్రహ్మణ్యం ఫోటోల సెట్టు 4 రూ. సినీతారల అడ్రసుల పుస్తకం 2 రూ ఈ క్రింది అడ్రసుకు ఎం.ఓ. చేసిన వారికి సంపబడును.
వై. కె. మూర్తి
దాసరివారి వీధి - విజయవాడ-2.

డా॥ పి. వి. కె. రావ్ B. A.,
వైద్యవిద్వాన్, వైద్యాచార్య, సెక్స్ స్పెషలిస్ట్.






వివాహము వాయిదా వేయ నవసరం లేదు. హస్త ప్రయోగం, నరముల బల హీనత, శీఘ్ర స్ఖలనములకు ఆయుర్వేద చికిత్స.
పోస్టు ద్వారా చికిత్స కలదు
రావూస్ క్లినిక్,
టి. బి. రోడ్, తెనాలి,
ఫోన్ : 700 — 1010





ఆయుర్వేదీయ
బైద్యనాథ్
దంతమంజన్
ఎఱ్ఱ పళ్ళపొడి
కేవలము పళ్ళపొడే కాదు! ఆయుర్వేద ఔషధము కూడాను !!
దంతములను చిగుళ్ళను గట్టి పరచును
ఇతర టూత్ పేస్టులు, పళ్ళపొడులు దంతములను శుభ్రపరచును. వీనిలో ఔషధీ పదార్థములు లేనందున రోగముల నరికట్టలేవు. కనుకనే భారతదేశములో 90 శాతము ప్రజలకు చిగుళ్ళ బాధ లున్నాయి.


దంతనిపుణులున్నటువంటి కన్స్యూమర్ కౌన్సిల్ ఆఫ్ ఇండియావారిచే ఆమోదించబడింది. ప్రసిద్ధ ఆయుర్వేద ఔషధములను తయారుచేయు శ్రీ బైద్యనాథ్ ఆయుర్వేద భవన్ లిమిటెడ్ వారిచే లవంగనూనె, వేప, తుమ్మ, శొంఠి, కర్పూరము మొదలగు అనేక అమూల్య వనమూలికలతో తయారు చేయబడినది. బైద్యనాథ్‌వారి ఎఱ్ఱ పళ్ళపొడి వాడుట వలన దంతములు, చిగుళ్ళు దృఢముగా, ఆరోగ్యముగా నుండును.
శ్రీ బైద్యనాథ్ ఆయుర్వేద భవన్ లిమిటెడ్
ఆయుర్వేద ఔషధముల తయారీదారులలో ప్రసిద్ధులు
INTERMARK/ DML 197


# బకాసురుడి రేషన్‌కార్డు

మయిన అనుభూతి ఏదో కలిగింది కే! లెయ్యడం మానేసి యజమానిని పరీక్షగ చూస్తున్నాడు.

"నువ్వు ... .. నువ్వు..." అంటున్నాడు యజమాని.

బకాసురుడు భూతద్దంలోంచి యజమాని వైపు చూశాడు. అందులో యజమాని భూతంలా కనబడ్డాడు.

"నువ్వు... నువ్వు... జనపీడుడనే భూతానివి. అవునా?" అన్నాడు బకాసురుడు అనుమానిస్తూ. అతనికి క్రమంగా తనెవరో గుర్తొస్తోంది.

"నువ్వు బకాసురుడివి! ఎన్నాళ్ళకు కలుసుకున్నాం! ఇంతకీ అసలెప్పుడు పుట్టావ్" అన్నాడు జనపీడుడు ఆనందంగా.

"రెణ్ణెళ్ళయింది" అన్నాడు బకాసురుడు సంతోషంగా. "ఇంకా ఎవరెవరున్నారు మనవాళ్ళిక్కడ ?"

"వాళ్ళూ వీళ్ళూ అని ఏమిటి? మన వాళ్ళంతా ఇక్కడే ఉన్నారు. నువ్వు భోంచెయ్! అందర్నీ ఒకసారి తిరిగేసి వద్దాం!" అని ఆగి "నువ్వే గడ్డి తింటున్నావేమిటి? మనుషుల్ని తింటం లేదా? పథ్యమా?" అన్నాడు.

"మనుషుల మధ్యనే ఉంటూ మనుషుల్ని తింటే గొడవైపోదూ?"

జనపీడుడు బకాసురుడి అమాయకత్వానికి జాలి పడ్డాడు.

"ఛఛ! అలాంటిదేం లేదు! మనుషుల్ని వేయించుకుతిను. పీక్కుతిను! వాళ్ళ రక్తం కూల్‌డ్రింక్‌లా స్ట్రాతో తాగు. వాళ్ళనుకోసి ఉప్పులో అద్దుకుతిను. అడిగే దిక్కుండదు. మేమంతా ఎలా బతుకుతున్నాం మరి?"

"నిజంగా !"

"పైగా, బియ్యం, గోధుమలూ, చక్కెరా వీటికి కరువేమోగాని మనుషులు మాత్రం షార్టేజి కాదు."

"మరి నా రేషన్ కార్డు ?" అన్నాడు.

"రేషన్ కార్డుమీద 'ముఖ్యాహారం' అని ఒక కాలం ఉంటుంది. నీ కార్డు మీద 'బియ్యం' అని రాసి వుందా? అందుకే నీకే కష్టాలు! రేపే వెళ్ళి ఆ కాలంలో బియ్యం అనేది కొట్టేయించి "ముఖ్యాహారం — మనుషులు" అని రాయించుకో! నీ తిండికి

...కా ఉండదు'' అన్నాడు జనపిడుడు.

బకాసురుడికి జ్ఞానోదయమైంది. పూటకి ...లు గురు చెప్పిన మనుషుల్ని తినడం మొద...ల్పాడు. కానీ చిత్రం! తిన్నకొద్దీ ఆక...క్కువవుతోంది! ''ఆకలి ఆరోగ్యానికి గుర్తు! బెంగ పడకు'' అన్నారు సాటి రాక్షసులు.

* * *

లక్ష్మి విష్ణుమూర్తివైపు చూసి అలవోకగా నవ్వింది. ఆ నవ్వులో వేళాకోళం కనబడుతోంది.

''వేళాపాళా లేకుండా వేళాకోళాలంటే నాకు గిట్టదు'' అని జనాంతికంగా అని, ''ప్రిస్టేజి ఇష్యూ అయిపోయింది! ఇక లాభం లేదు! అవతార మెత్తాల్సిందే!'' అనుకున్నాడు విష్ణుమూర్తి.


# సమైక్యత - సంఘీభావం - నేటి తక్షణావశ్యకతలు

మనదేశం వివిధ మతాలు, జాతులు, భాషలకు పుట్టినిల్లు. ఈ వైవిధ్యం, సొగసు మన దేశాన్ని రంగుల పుష్పగుచ్ఛంగా తీర్చి దిద్దాయి. ఈ గుచ్ఛంలోని ప్రతి పుష్పాన్ని సంరక్షించుకోవలసిన బాధ్యత మనందరిపైనా వుంది.

అశోకుడు, అక్బరు, నానక్, గాంధీ, నెహ్రూ వంటి మహా పురుషులకు జన్మనిచ్చిన మన దేశం అభివృద్ధిపథంలో పయనిస్తోంది. హింసాత్మక చర్యలకు పూనుకుని జాతి ప్రగతికి మనం అవరోధం కల్పించడం తగదు.

మతం, భాష, ప్రాంతీయతత్వాల పేరుతో జరిగే హింసాత్మక సంఘటనలు మన ఆర్థిక వినాశనానికి దారి తీస్తాయి.

మన ఆంధ్రప్రదేశ్ ఆదర్శప్రాయమైన మత సామరస్యానికి, ఐక్యతకూ దేశమంతటా పేరుపొందింది.

★ ప్రతి మతాన్ని, ప్రార్థనా స్థలాన్ని గౌరవిద్దాము.

★ అన్ని పండుగలు కలిసి జరుపుకుందాం.

★ సాంఘిక సమానత్వం, అభివృద్ధి కోసం చేయి చేయి కలిపి పని చేద్దాం.

★ స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, లౌకిక విధానాల రక్షణకు ప్రతిజ్ఞ చేద్దాం.

★ సహోదరుల్లా కలిసి మెలిసి బ్రతుకుదాం.

డైరెక్టరు, సమాచార, పౌరసంబంధ శాఖ, హైదరాబాదు.

DIPR No. 20792/Advt/C1-3,81